సాక్షి కాకినాడ

శనివారం । 23 । సెప్టెంబర్ । 2023



అన్నదానానికి విరాళం


ఆత్రేయపురం: వాడపల్లి శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో నిత్యాన్నదాన పథకానికి వాడపల్లి శ్రీకాంత్, లక్ష్మీప్రసన్న దంపతులు(మహారాష్ట్ర) శుక్రవారం రూ.లక్ష విరాళం అందజేశారు.



నిత్యాన్నదాన పథకానికి విరాళం

అన్నవరం: సత్యదేవుని నిత్యాన్నదాన పథకానికి సత్య రేయాన్స్ (హైదరాబాద్) శుక్రవారం రూ.2 లక్షల విరాళాన్ని సమర్పించారు.

కాలువలకు నీరు విడుదల



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజ్ నుంచి శుక్రవారం తూర్పు డెల్టాకు 4700,మధ్య డెల్టాకు 2200,పశ్చిమ డెల్టాకు 7000క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. 2,37,047 క్యూసెక్కుల మిగులు జలాలను సముద్రంలోకి విడుదల చేశారు.

న్యూస్‌రీల్

ప్రధానోపాధ్యాయుడిపై చర్యలకు సిఫార్సు

రౌతులపూడి: మండలంలోని సబ్‌ప్లాన్ ఏజెన్సీకి చెందిన చల్లూరు, దబ్బాది, సార్లంక గ్రామాల్లో ఇటీవల రాష్ట్ర ఎస్టీ కమిషన్ సభ్యుడు వడిత్యా శంకర్‌నాయక్ పర్యటించారు. ఈ పర్యటనలో భాగంగా రాఘవపట్నం ఆశ్రమ పాఠశాలను సందర్శించి పాఠశాలలో అన్ని తరగతి గదులను పరిశీలించారు. పాఠ్యాంశాలకు సంబంధించి విద్యార్థుల సామర్థ్యం తక్కువగా ఉండడాన్ని గుర్తించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు గుమ్మడి గంగరాజు మద్యం తాగినట్లు ఎస్టీ కమిషన్ సభ్యుడు గుర్తించి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈయన్ను సస్పెండ్ చేయాలని సిఫార్స్ చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.ఈమేరకు చర్యలు తీసుకోవాలని అల్లూరి సీతారామరాజు జిల్లా గిరిజన సంక్షేమశాఖ ఉపసంచాలకులకు సూచిస్తూ లేఖ రాసినట్లు జిల్లా గిరిజన సంక్షేమశాఖ అధికారిణి విజయశాంతి తెలిపారు.

25న రత్నగిరిపై డయల్ యువర్ ఈఓ

అన్నవరం: శ్రీ వీర వేంకట సత్యనారాయణ స్వామివారి దేవస్థానంలో ఈ నెల 25న డయల్ యువర్ ఈఓ' కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమం గత ఐదేళ్లుగా ప్రతీ నెల చివరి సోమవారం నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. వివిధ కారణాలతో గత మూడు నెలలుగా నిర్వహించలేదు. వచ్చే సోమవారం ఉదయం 10-30 నుంచి 11-30 గంటల వరకు భక్తులు 08868-238127 నంబరుకు ఫోన్ చేయాలి. అలాగే దేవస్థానం అసిస్టెంట్ కమిషనర్ రమేష్ బాబుకు తమ విలువైన సలహాలు, సూచనలతోబాటు ఫిర్యాదులు తెలియ చేయవచ్చునని తెలిపారు.

25న యథావిధిగా స్పందన

కాకినాడ సిటీ: జగనన్నకు చెబుదాం (స్పందన) కార్యక్రమం సామర్లకోట, పెద్దాపురం మండలాలకు సంబంధించి ఈనెల 25న ఉదయం 10 గంటల నుంచి 1 గంట వరకు యార్లగడ్డ వెంకటసుబ్బారావు కల్యాణమండపంలో జరుగుతుంది. డీఆర్వో కె శ్రీధర్‌రెడ్డి శుక్రవారం ఈమేరక ఒక ప్రకటనలో తెలిపారు. అదే సమయంలో జిల్లా స్థాయి జగనన్నకు చెబుదాం స్పందన ప్రతి సోమవారం కలెక్టరేట్‌లోని స్పందన హాలులో యథావిధిగా ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు జరుగుతుందని స్పష్టం చేశారు.

క్రీడలలో అంతర్జాతీయ స్థాయికి ఎదగాలి

జేఎన్‌టీయూకే వీసీ ప్రొఫెసర్ ప్రసాదరాజు

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): క్రీడలలో అంతర్జాతీయ స్థాయికి ఎదిగేలా వ్యాయామ ఉపాధ్యాయులు కృషి చేయాలని జేఎన్‌టీయూకే వీసీ డాక్టర్ జీవీఆర్ ప్రసాదరాజు పేర్కొన్నారు. జేఎన్‌టీయూకేలో శుక్రవారం యూనివర్సిటీ స్పోర్ట్స్ కౌన్సెల్ ఆధ్వర్యంలో 15వ అనుబంధ కళాశాలల ఫిజికల్ ఎడ్యుకేషన్ అధ్యాపకుల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. వీసీ ప్రసాదరాజు మాట్లాడుతూ ఫిజికల్ ఎడ్యుకేషన్‌లో వినూత్న మార్పులు తీసుకువస్తున్నామని, కీడాకారులకు 0.5 క్రెడిట్స్ కేటాయిస్తున్నామన్నారు. కౌన్సిల్ కార్యదర్శి శ్యామ్‌కుమార్, ఇంటర్ కాలేజియేట్ టోర్నీల కార్యదర్శి డాక్టర్ జీపీ రాజు క్రీడలలో పాల్గొనే విద్యార్థులకు అందించే క్రెడిట్స్ ఎలా విభజించాలి, ఏ విధంగా మూల్యాంకనం చేయాలో అవగాహన కల్పించారు. అంతర్ కళాశాలల క్రీడల్లో ప్రతిభ చూపిన వ్యాయామ ఉపాధ్యాయులను రిజిస్ట్రార్ సుమలత ఆధ్వర్యంలో సత్కరించారు. ప్రిన్సిపాల్ కృష్ణప్రసాద్, అనుబంధ కళాశాలల పీడీలు పాల్గొన్నారు.





పారా హుషార్

- పురోగమిస్తున్న పారా **మెడికల్** రంగం
- ప్రభుత్వ చర్యలతో **పెరిగిన** ఉద్యోగ అవకాశాలు
- స్వయం ఉపాధికీ ఇది రాజమార్గం
- ఏడాదిలో 34 కొత్త ల్యాబ్‌లు. 530 మందికి ఉద్యోగాలు
- వైద్య ఆరోగ్య రంగ పరిపుష్టితో సాధ్యం



కాకినాడ డీఎంహెచ్‌వో కార్యాలయంలో పారామెడికల్ ఉద్యోగ నియామక ప్రక్రియ (ఫైల్)

కాకినాడ క్రైం: ప్రభుత్వ చొరవతో జిల్లాలో పారా మెడికల్ రంగం పరిపుష్టమైంది. ఉద్యోగ, ఉపాధి అవకాశాలు ఊహకందని రీతిలో పెరగడంతో నిరుద్యోగ సమస్యకు అడ్డుకట్టపడింది. 2019 నుంచి ప్రభుత్వ పొరుగుసేవలు, ఒప్పంద విధానాల్లో ఎక్కువ పోస్టులు ఏర్పడ్డాయి. అవన్నీ వారాల వ్యవధిలోనే భర్తీ అయ్యాయి. ప్రైవేటు, స్వయం ఉపాధి రంగంలోనూ పారా మెడికల్ వెలుగులీనుతోంది. ప్రభుత్వం చొరవ చూపితే కీలక రంగాల వలంల జనబాహుళ్యానికి ఏ స్థాయి లబ్ధి చేకూరుతుందో తెలియజెప్పడానికి పారా మెడికల్ రంగమే ఉదాహరణ.

పారామెడికల్ అంటే...

పారామెడికిల్ రంగం వైద్య ఆరోగ్య రంగంలో ఓ కీలక భాగం. డాక్టర్లు అందించే వైద్యానికి పారా మెడికల్ నిపుణులు నిర్ధారణ ముఖ్యం. వారు నిర్వహించే పరీక్షలు ఇతర నిర్ధారణలు వైద్యుడికి దిశానిర్దేశాన్నిస్తాయి. రోగికి ఏ స్థాయి వైద్యం అందించాలో స్పష్టతను సూచిస్తాయి. డీఎంఎల్‌టీ, డీఎంఐటీ, డీవోఏ, డీడీఐఏఎల్‌వై, డీఆర్‌ఈఎస్‌టి, డీఎంఎస్‌టి, డీపీఈఆర్‌ఎఫ్‌యూ, డీవోఏ, డీఆర్‌టీటీ, డీఆర్‌జీఏ, డీడీఆర్‌ఏ, డీ కార్డియో, డీసీఎల్‌టీ, డీఈసీజీ, డీఏఎస్‌ఎస్, డీఎంపీహెచ్‌ఏ పారామెడికల్‌లో ప్రధాన కోర్సులు.

వైద్య ఆరోగ్య రంగ బలోపేతం వల్లే...

వైద్య ఆరోగ్య రంగ బలోపేతంతో గతానికీ ఇప్పటికీ పారా మెడికల్ రంగ పురోగామిలో సమూల మార్పులు చోటు చేసుకున్నాయి. పారామెడికల్ విద్య నభ్యసించిన విద్యార్థులు, నిరుద్యోగుల జీవితాల్లో రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక చొరవ వెలుగులు నింపింది. జగన్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి క్షేత్రస్థాయిలో ఆరోగ్య కేంద్రాల ఏర్పాటు పారామెడికల్ నిపుణుల సేవల ఆవశ్యకతకు కారణమైంది. ఆరోగ్య కేంద్రాల ఏర్పాటుతో పాటు ఆయా కేంద్రాలలో, వాటి పరిధిలో సేవలందించేందుకు అధిక సంఖ్యలో పారామెడికల్ నిపుణుల నియామకం అనివార్యమైంది.

అందుబాటులో ఉన్న కోర్సుల సంఖ్య	: 16
ప్రభుత్వ బోధనా కేంద్రం	: 01
ప్రైవేటు బోధనా కేంద్రాలు	: 07
ఆర్ఎంసీలో ప్రభుత్వ సీట్లు	: 101
ఆర్ఎంసీలో కోర్సులు	: 08
జిల్లాలో ల్యాబ్‌లు	: 200
అనుమతి పొందిన ఫిజియోథెపీ కేంద్రాలు	: 07
రెండేళ్లలో ఉద్యోగాలు	: 530
ఏడాదిలో ఏర్పాటైన కొత్త ల్యాబ్‌లు	: 34

34 ల్యాబ్‌లు... 530 ఉద్యోగాలు...

గడచిన రెండేళ్లలో జిల్లా పరిధిలో 530 మంది పారామెడికల్ అభ్యర్థులు ఉద్యోగాలు పొందారు. వీరంతా ప్రభుత్వ అనుబంధ పొరుగు సేవలు, ఒప్పంద విధానంలో నియమితులైన వారే. వీటిలో 321 పోస్టులు సంయుక్త నియామకాలు కాగా, పీహెచ్‌సీల పరిధిలో 135, జీజీహెచ్, ఆర్ఎంసీలలో 19, ఏపీవీవీపి పరిధిలో 55 పారామెడికల్ పోస్టులు భర్తీ చేశారు. పారామెడికల్ రంగం స్వయం ఉపాధికి తిరుగులేని మార్గమని మరో మారు రుజువైంది. ఏడాది కాలంలో 30 మంది జిల్లాలో సొంత ల్యాబ్‌లు పెట్టుకొని జీవనోపాధిని ప్రారంభించారు. ఒక్కో ల్యాబ్ కనీసం నలుగురు సిబ్బంది చొప్పున జీవనాధారాన్ని కల్పిస్తోంది.

ఎనిమిది టీచింగ్ సెంటర్‌లు

జిల్లాలో పారామెడిక్ విద్యాబోధనకు ఏడు ప్రైవేటు, ఒక ప్రభుత్వ బోధనా కేంద్రం ఉన్నాయి. కాకినాడ రంగరాయ వైద్య కళాశాల ప్రభుత్వ పరిధిలో ఉచిత బోధనను అందిస్తుండగా జిల్లాలో ఏడు ప్రాంతాల్లో ప్రైవేటు పారామెడికల్ కళాశాలలు ఉన్నాయి. ఈ కోర్సుల్లో చేరేందుకు కనీస విద్యార్హత ఇంటర్మీడియట్. బైపీసీ ప్రధానం కాగా ఏ గ్రూపు వారికైనా ప్రాధాన్యత లభిస్తుంది. ఈ ఏడాది జూన్‌లో ప్రభుత్వ కళాశాల ఆర్ఎంసీలో చేరికల కోసం పారామెడికల్ బోర్డు నోటిఫికేషన్ విడుదల చేయగా ఆర్ఎంసీలో పారామెడికల్‌లో ఎనిమిది కోర్సులకు గాను 101 అడ్మిషన్ల భర్తీ జరిగింది. వచ్చే నెల 3వ తేదీ నుంచి తరగతులు ప్రారంభం కానున్నట్లు ఆర్ఎంసీ పారా మెడికల్ విభాగం కో కన్వీనర్ డాక్టర్ సతీష్ తెలిపారు.

భవిష్యత్ బంగారం

పారామెడికల్ రంగం విద్యార్థుల బంగారు భవితకు భరోసా ఇస్తోంది. సొంతంగా ఆరోగ్య పరీక్షా కేంద్రాల ఏర్పాటుతో పాటు ప్రైవేటు కార్పొరేట్ వైద్య రంగంలో పారామెడికల్ సేవలు తప్పనిసరి. దీంతో నిపుణుల డిమాండ్ నానాటికీ పెరుగుతోంది. ఈ పరంపరంలో ఐదు కోర్సులు కీలకం అవుతున్నాయి. విద్యార్థులు ఈ ఐదు కోర్సుల అభ్యాసానికి అధిక ప్రాధాన్యతనిస్తున్నారు. అవేవంటే...

- డిప్లొమా ఇన్ మెడికల్ ల్యాబ్ టెక్నీషియన్(డీఎంఎల్‌టీ)
- డిప్లొమా ఇన్ ఎనస్థీషియా టెక్నీషియన్(డీఏఎస్ఎస్)
- డిప్లొమా ఇన్ మెడికల్ ఇమేజింగ్ టెక్నాలజీ(డీఎంఐటీ)
- డిప్లొమా ఇన్ ఆప్తాల్మాలజిక్ అసిస్టెంట్(డీవోఏ)
- డిప్లొమా ఇన్ కార్డియాలజీ టెక్నీషియన్(డీకార్డియో)

స్వయంశక్తితో ఐదు బ్రాంచ్‌లు



పారామెడికల్ రంగం స్వయం ఉపాధికి సువర్ణావకాశం. డాక్టర్ల వైద్యం ఆధారపడి ఉండేది కచ్చితమైన రిపోర్టులతోనే. రోగి ఆరోగ్య స్థితిపై నిర్దిష్ట అంచనాకు రావాలంటే పారామెడికల్ సేవలు తప్పనిసరి. అంతటి ప్రాధాన్యత ఉన్న రంగం కొన్నాళ్లు నిర్లక్ష్యానికి గురైనా కూడా తాజా పరిస్థితులు అత్యంత ఆశాజనకంగా మారాయి. రాష్ట్ర ప్రభుత్వం వైద్య ఆరోగ్య రంగ బలోపేతానికి తగిన చర్యలు తీసుకోవడంతో **పారామెడికల్ రంగం** ప్రాధాన్యత మరింత పెరిగింది. **పదేళ్ల కాలంలో నగరంలో** ఐదు సొంత ల్యాబ్‌లు **ప్రారంభించాను.**

– **వెంకట్, బెస్ట్ క్లినికల్** ల్యాబ్ వ్యవస్థాపకుడు

భవిష్యత్ ఆశాజనకం



ప్రభుత్వం వైద్య ఆరోగ్య సేవల **బలోపేతానికి చేస్తున్న** చర్యలతో **పారామెడికల్ రంగం** అభివృద్ధి **చెందుతోంది. భవిష్యత్ భ**రోసాకు ఎటువంటి సం**శయం లేకుండా ఈ రంగా**న్ని ఎంచుకోవచ్చు. ఇంట**ర్మీడియట్ తర్వాత రెండేళ్లలో** ఉపాధి పొందేందుకు **అవకాశం ఉన్న రంగం** ఇది. ఇందులో ప్రతి **కోర్సుకు ప్రాధాన్యత ఉంది**. అవగాహన లేక కొం**దరు విద్యార్థులు కొన్ని కోర్సు**లకే ప్రాధాన్యత ఇస్తు**న్నారు. ఇది సరికాదు.** మరిన్ని ఉద్యోగాల కల్పనకు **ప్రభుత్వం ప్రణాళికలు** సిద్ధం చేస్తోంది. కొత్త వైద్య కళాశాలలు భవిష్యత్‌లో పారామెడికల్ రంగాన్ని మరింత ఆశాజనకంగా మార్చబోతున్నాయి.

– డాక్టర్ డీఎస్‌వీఎల్ నరసింహం, రాష్ట్ర వైద్య విద్యా సంచాలకుడు

జిల్లా స్థాయి క్రీడల్లో దివ్యాంగుల ప్రతిభ

తుని రూరల్: ప్రత్యేక అవసరాల పిల్లలకు జిల్లా స్థాయిలో జరిగిన క్రీడా పోటీల్లో తుని భవిత సెంటర్‌కు చెందిన 14మందికి ప్రథమ, ద్వితీయ, తృతీయ విభాగాల్లో మెడల్స్ సాధించినట్లు సెంటర్ ఐఈఆర్‌పీలు ఎం.రాంబాబు, ఎస్.శ్రీనివాస్ శుక్రవారం తెలిపారు. ఈ నెల 20న కాకినాడ పీఆర్ డిగ్రీ కళాశాల మైదానంలో 21 మండలాలకు చెందిన ప్రత్యేక అవసరాల పిల్లలకు అండర్ 12. 14, 18 విభాగాల్లో క్రీడ పోటీలు జరిగాయన్నారు. కలెక్టర్ కృతికా శుక్లా, సహిత విద్యా విభాగం ఆర్‌జేడీ నాగమణి, ఐఈ కోఆర్డినేటర్ చామంతి నాగేశ్వరరావు ఆధ్వర్యంలో ఈ పోటీలు జరిగాయన్నారు. అండర్ 19 విభాగం లాంగ్ జంప్‌లో ఎ.హరి సంతోష్ కుమార్ (ప్రథమ), సాఫ్ట్‌బాల్ త్రోలో పి.లీలాకుమార్ (ప్రథమ), అండర్ 14 సాఫ్ట్‌బాల్ త్రో విభాగంలో బి.వి.వి.సత్యనారాయణ (ద్వితీయ), అండర్ 12 సాఫ్ట్‌బాల్ త్రో విభాగంలో ఎ.రోషన్ ప్రథమ స్థానాలు కైవసం చేసుకున్నారన్నారు. అండర్ 18 విభాగం వంద మీటర్ల పరుగులో ద్వితీయ స్థానాన్ని ఎ.హరి సంతోష్ కుమార్, అండర్ 14 విభాగం పరుగులో యు.ఆదర్శ ద్వితీయ స్థానం లభించిందన్నారు. అండర్ 14 బాలిక పోటీల్లో లాంగ్ జంప్, వంద మీటర్ల పరుగులో రాగ చాంధినీ ద్వితీయ, తృతీయ స్థానాలను గెలుపొందింది. విజేతలకు మెరిట్ సర్టిఫికేట్లు, మెడల్స్ లభించాయన్నారు. విజేతలైన ప్రత్యేక అవసరాల పిల్లలను ఎంఈఓ పరవాడ గీతాదేవి, అదనపు ఎంఈఓ రామకృష్ణ, ఐఈడీఎస్ఎస్ టీచర్ కొండబాబు, ఉపాధ్యాయులు, సీఆర్‌పీలు, తల్లిదండ్రులు అభినందించారు.



జిల్లాస్థాయి క్రీడాల్లో మెరిట్ సర్టిఫికేట్లు, మెడల్స్ సాధించిన ప్రత్యేక అవసరాల పిల్లలు, ఉపాధ్యాయులు

తేటగుంట పీహెచ్‌సీకి క్వాలిటీ సర్టిఫికేట్

- 87.99 ఓవరల్ స్కోర్‌తో ప్రథమస్థానం
- మూడేళ్ల పాటు ప్రత్యేక గ్రాంటుకు అర్హత



తేటగుంట పీహెచ్‌సీ భవనం



పీహెచ్‌సీలో గర్భిణులకు వైద్యసేవలు అందిస్తున్న సిబ్బంది

తుని రూరల్: తుని మండలం తేటగుంటలో ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ నేషనల్ క్వాలిటీ అష్యూరెన్స్ స్టాండర్ట్స్ (క్వాలిటీ సర్టిఫికేట్) ప్రకటించింది. ఈ మేరకు శుక్రవారం గవర్నమెంట్ ఆఫ్ ఇండియా, మినిస్టరీ ఆఫ్ హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ జాయింట్ సెక్రటరీ విశాల్ చౌహాన్ నుంచి సమాచారం అందినట్లు పీహెచ్‌సీ వైద్యురాలు డాక్టర్ కొప్పుల అన్వేషి తెలిపారు. ఆరు కేంద్ర ప్రభుత్వశాఖల నిపుణులు జూలై 26 నుంచి ఆగస్టు పది వరకు వేర్వేరుగా రాష్ట్రంలో పర్యటించి పీహెచ్‌సీల్లో మౌలిక సదుపాయాల కల్పన, మెరుగైన వైద్య సేవలు, ఓపీ, ల్యాబ్, మందుల నిర్వహణ, పరిసరాల పరిశుభ్రత, జాతీయ ఆరోగ్య పథకాలు అమలు, తదితర అంశాలను పరిశీలించారన్నారు. అందులో భాగంగా జూలై 26, 27 తేదీల్లో తేటగుంట పీహెచ్‌సీని కేంద్ర బృందం పరిశీలించిందన్నారు. రాష్ట్రంలో అల్లూరు సీతారామరాజు జిల్లా మాడుగుల, ప్రకాశం జిల్లా కొత్తపట్నం, విజయవాడ హెచ్‌బీ. కాలనీ, బాపట్ల జిల్లా దగ్గుపాడు, అనంతపురం జిల్లా రాప్తాడు, నాగలాపురం, శ్రీకాకుళం జిల్లా బైదలపురం. కాకినాడ జిల్లా తేటగుంట పీహెచ్‌సీలకు క్వాలిటీ సర్టిఫికేట్లను ప్రకటించారు. వీటిలో ఓవరల్ స్కోర్ 81.19 నుంచి 87.99 ఉండగా అత్యధికంగా 87.99 ఓవరల్ స్కోర్ దక్కడంతో రాష్ట్రంలో తేటగుంట పీహెచ్‌సీ ప్రథమ స్థానాన్ని పొందగలిగింది. క్వాలిటీ సర్టిఫికేట్‌తో పాటు మరిన్ని మౌలిక వసతులు కల్పించేందుకు కేంద్ర ఆరోగ్య, కుటుంబ మంత్రిత్వ శాఖ ప్రత్యేక గ్రాంటుగా నిధులు ఇవ్వనుంది.

సమష్టి కృషితో క్వాలిటీ సర్టిఫికేట్



తనతో పాటు పీహెచ్‌సీలో సిబ్బంది సమష్టి కృషి ఫలితంగానే క్వాలిటీ సర్టిఫికేట్ లభించింది. రాష్ట్రంలో ప్రథమ స్థానం లభించడం సంతోషాన్నిచ్చింది. రోజు 80 నుంచి వంద మందికి పీహెచ్‌సీలో వైద్య సేవలు అందిస్తున్నాము. గర్భిణులకు ప్రత్యేక సేవలు, కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ పథకాల ప్రచారం, ఆస్పత్రి నిర్వహణలో ప్రత్యేక శైలిని అనుసరిస్తున్నాము.క్వాలిటీ సర్టిఫికేట్‌తో పాటు మూడేళ్ల ప్రతి సంవత్సరం రూ.మూడు లక్షలు చొప్పున ప్రత్యేక గ్రాంటు లభిస్తుంది. ఈ నిధులను రోగులకు సౌకర్యాలు మెరుగుపర్చడం, ఆస్పత్రిలో ఇతరేతర అవసరాలకు వినియోగించాల్సి ఉంది.

– డాక్టర్ కొప్పుల అన్వేషి, పీహెచ్‌సీ వైద్యురాలు, తేటగుంట, తుని మండలం.

జగనన్నకు చెబుదాం కార్యక్రమానికి 285 అర్జీలు



అర్జీదారుల సమస్యలు వింటున్న కలెక్టర్ కృత్తికా శుక్లా

కొత్తపల్లి: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో వచ్చిన ప్రతీ అర్జీని క్షణ్ణంగా పరిశీలించి పరిష్కారం చూపుతామని కలెక్టర్ కృత్తికా శుక్లా చెప్పారు. స్థానికంగా సుర్జా ఆడిటోరియంలో శుక్రవారం జగనన్నకు చెబుదాం (స్పందన) కార్యక్రమం జరిగింది. అర్జీదారులకు ఇబ్బందులు కలుగకుండా రెవెన్యూ, పంచాయితీ, సచివాలయ సిబ్బంది స్వయంగా అర్జీల సమర్పణలో సహకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గత రెండు వారాల నుంచి ప్రతీ మండలంలో స్పందన కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. ఇప్పటికే తాళ్ళరేవు, పెదపూడి, కిర్లంపూడి మండలాల్లో నిర్వహించామన్నారు. ఈ స్పందనకు జిల్లాస్థాయి అధికారులు హాజరవడమే కాకుండా అర్జీదారుల సమస్యలను పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామన్నారు. స్పందనకు 285 అర్జీలు రాగా వీటిలో ఇసుకపల్లినుంచి 70అర్జీలు ఎండపల్లి చెరువు భూములకు సంబంధించినవే. జగనన్న కోలనీలో మౌలిక సదుపాయాలు కల్పించాలని, గ్రామాల్లో రోడ్లు, తాగునీరు, డ్రైనేజీ వ్యవస్థ, శిథిలావస్థకు చేరిన విద్యుత్ స్తంభాలను మార్చాలని కొందరు కోరారు. ఇళ్ల స్థలాలు,నిర్మాణానికి రుణాలు మంజూరు కోసం మరి కొందరు దరఖాస్తు చేసుకున్నారు. కేఎస్ఈజెడ్‌కు సంబంధించి భూ సర్వే, సాగరమాల రోడ్డు కోసం భూములు కోల్పోయిన రైతుల పరిహారం, సమగ్ర భూహక్కు రీసర్వేలో భూమి వివరాలు తక్కువ నమోదు కావడంపై అర్జీలు దాఖలు సమర్పించారు. వీటన్నింటినీ పూర్తి స్థాయిలో పరిష్కరిస్తామని కలెక్టర్ పేర్కొన్నారు. వాకతిప్పలో డెంగ్యూ జ్వరంతో ఒకకు మృతి చెందిన నేపథ్యంలో అక్కడ ప్రత్యేక పారిశుధ్యం డ్రైవ్ నిర్వహిస్తామన్నారు. సీజనల్ వ్యాధులపై ఫోకస్ పెట్టామన్నారు. దీనిపై ప్రజలకు వైద్య సిబ్బంది అవగాహన కల్పిస్తారన్నారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఇలక్కియా, జిల్లా పంచాయితీ అధికారి విక్టర్, రెవన్యూ అధికారి శ్రీధర్‌రెడ్డి, జెడ్పీ సీఈఓ రమణారెడ్డి, ఆర్డీఓ ఎస్‌వీవీ సత్యన్నారాయణ, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ శ్రీనివాస్, ఎంపీడీఓ అబ్రహం లింకన్, తహశీల్దారు జీవీఎస్ ప్రసాద్, పలు జిల్లా, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

డాక్టర్ లావణ్యకుమారి బాధ్యతల స్వీకరణ



జీజీహెచ్ సూపరింటెండెంట్‌గా బాధ్యతలు స్వీకరిస్తున్న డాక్టర్ లావణ్యకుమారి

కాకినాడ క్రైం: కాకినాడ జీజీహెచ్ సూపరింటెండెంట్‌గా డాక్టర్ సరెళ్ల లావణ్యకుమారి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమెకు డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ హరి విజయ్‌కుమార్, డీసీఎస్ ఆర్ఎంవో డాక్టర్ అనిత, ఆర్ఎంవో డాక్టర్ రాహుల్ అభినందనలు తెలిపారు. వివిధ విభాగాల అధికారులు, సిబ్బంది సహా ఏపీ ఎన్‌జీవో రాష్ట్ర ఉపాధ్యక్షుడు పసుపులేటి శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఎన్‌జీవో బృందం, మినిస్టీరియల్ ఎంప్లాయిస్ అసోసియేషన్ పాలపర్తి మూర్తిబాబు ఆధ్వర్యంలో పీవి కృష్ణ, ఏడీ అనురాధ, టీఎస్ఎల్ఎస్ మూర్తి, అకౌంటెంట్ సుబ్రహ్మణ్యం, మేనేజర్ నరసింగరావు, విశ్రాంత ఆర్థోపెడిక్ ప్రొఫెసర్ డాక్టర్ ప్రబోధ్‌కుమార్ తదితరులు డాక్టర్ లావణ్యకుమారికి అభినందనలు తెలిపిన వారిలో ఉన్నారు.

వైదిక కార్యక్రమాలకు వేదిక

- పలు రకాలుగా ఉపయోగపడుతున్న వార్షిక కల్యాణ మండపం
- వార్షిక కల్యాణంతో పాటు అన్ని ప్రధాన వేడుకలూ ఇక్కడే
- రూ.40 లక్షల వ్యయంతో నిర్మించిన దాత పెదబాబు
- కార్తీకమాసంలో వ్రతాలు నిర్వహణ : ఈఓ చంద్రశేఖర్



సత్యదేవుని నిత్య కల్యాణ మండపం



వార్షిక కల్యాణ మండపంలో వరలక్ష్మి సామూహిక వ్రతం (ఫైల్)

అన్నవరం: రత్నగిరిపై కొలువైన శ్రీ వీర వేంకట సత్యనారాయణ స్వామివారి దేవస్థానంలోని సత్యదేవుని వార్షిక కల్యాణ మండపం, దాని ముందున్న విశ్రాంతి మండపం అటు వైదిక కార్యక్రమాలకు, ఇటు భక్తుల విశ్రాంతికి ఉపయోగపడుతున్నాయి. వచ్చే కార్తీకమాసంలో విశ్రాంతి మండపంలో వ్రతాలు కూడా నిర్వహించాలని ఈఓ చంద్రశేఖర్ ఆజాద్ నిర్ణయించారు. ఏటా వైశాఖ శుద్ధ ఏకాదశి నాడు జరిగే స్వామివారి దివ్య కల్యాణ మహోత్సవాన్ని చిన్న కల్యాణ మండపంలో నిర్వహించేవారు. మండపం ఎదురుగా కూర్చున్న భక్తులకు తప్ప ఇతరులకు కల్యాణం తిలకించే అవకాశం ఉండేది కాదు.

ఎక్కువ మంది తిలకించే సౌకర్యం

ఎక్కువ మంది స్వామివారి దివ్యకల్యాణం తిలకించేందుకు 2020లో సప్తగిరి హేచరీస్ అధినేత సత్తి సూర్యనారాయణ రెడ్డి (పెదబాబు) రూ. 40 లక్షల వ్యయంతో విశాలమైన వార్షిక కల్యాణ మండపాన్ని నిర్మించారు. సుమారు రూ. కోటి వ్యయంతో కాకినాడ అర్బన్ డవలప్‌మెంట్ అథారిటీ (కౌడా) దేవస్థానం విశ్రాంతి మండపాన్ని నిర్మించింది. ఈ రెండూ 2021 జూలైలో ప్రారంభమయ్యాయి. తొలుత ఈ మండపాన్ని స్వామివారి వార్షిక కల్యాణ వేదికగా మాత్రమే ఉపయోగించాలనుకున్నారు. మండపం ముందున్న విశాలమైన షెడ్డులో సుమారు రెండు వేలకు పైగా భక్తులు తిలకించే అవకాశం ఉండడంతో అన్ని వైదిక కార్యక్రమాలు ఇక్కడే నిర్వహిస్తున్నారు. ఈ ఏడాది మార్చిలో దేవస్థానం ఈఓ గా చంద్రశేఖర్ ఆజాద్ బాధ్యతలు స్వీకరించాక ప్రతి వైదిక కార్యక్రమాలను ఇదే వేదిక మీద నిర్వహిస్తున్నారు. శ్రీరామ నవమి నాడు సీతారాముల కల్యాణం, మేలో సత్యదేవుని దివ్యకల్యాణం, కల్యాణ మహోత్సవాల చివరి రోజున శ్రీపుష్పయాగం ఇక్కడే నిర్వహించారు. శ్రావణ మాసంలో సామూహిక వరలక్ష్మీ వ్రతాల కార్యక్రమానికి ఇదే వేదికైంది. ప్రస్తుతం గణపతి నవరాత్రులు నిర్వహిస్తున్నారు.

దాత పెదబాబుకు సన్మానం

ఈఓ చంద్రశేఖర్ ఆజాద్ ఆదేశాల మేరకు సత్యదేవుని వార్షిక కల్యాణ మండప దాత సత్తి సూర్యనారాయణ రెడ్డి (పెదబాబు)ను దేవస్థానం పండితులు ఘనంగా సత్కరించారు. స్వామివారి ప్రధానాలయంలో ప్రదక్షిణ చేసే చోట నాలుగు దిక్కులా నలుగురు దేవతా మూర్తుల విగ్రహాలను ప్రతిష్టించడానికి పెదబాబు సహకారం అందించాలని దేవస్థానం ఏఈఓ కృష్ణారావు, వేద పండితులు యనమండ్ర శర్మ, సంతోష్, వైదిక కార్యక్రమాల సూపర్‌వైజర్ నాగాభట్ల కామేశ్వర శర్మ కోరారు. 29న ఈఓతో చర్చించి నిర్ణయం తెలియచేస్తానని దాత తెలిపినట్లు సమాచారం.

క్లుప్తంగా

గణపతి లడ్డూ రూ.66,000



రూ.66 వేలు పలికిన గణపతి లడ్డూతో ప్రిన్స్ యూత్ సభ్యులు

అయినవిల్లి: వినాయక చవితి మహోత్సవాల్లో భాగంగా మండలంలోని పోతుకుర్రు గ్రామంలో గణేశునికి సమర్పించిన లడ్డూకు ఆలయ కమిటీ సభ్యులు శుక్రవారం వేలం వేశారు. ఈ లడ్డూను ప్రిన్స్ యూత్ సభ్యులు రూ.66 వేలకు దక్కించుకున్నారు. వీరిని గ్రామస్తులు అభినందించారు.

దాడి చేసి గాయపరచిన వ్యక్తికి ఏడాది జైలు

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): ఒక మహిళపై దాడి చేసి గాయపరచిన ఘటనలో స్థానిక క్వారీ పేటకు చెందిన మరో మహిళ లచ్చిరెడ్డి నాగబాలకు ఏడాది జైలు శిక్ష విధిస్తూ రెండో అదనపు కోర్టు జడ్జి ఎ.కృష్ణప్రసాద్ శుక్రవారం తీర్పు చెప్పారు. వివరాలివీ.. మంగళవారపుపేటకు చెందిన లచ్చిరెడ్డి దుర్గకు, క్వారీ పేటకు చెందిన నాగబాలకు కుటుంబ తగాదాలు ఉన్నాయి. 2018 ఏప్రిల్ నాలుగో తేదీన దుర్గ ఇంటికి నాగబాల వచ్చి సిమెంటు రాయితో తలపై కొట్టింది. దీనిపై వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. విచారణ అనంతరం న్యాయమూర్తి పైవిధంగా తీర్పు చెప్పారు. ఏపీపీ ఎస్.విజయ్‌కుమార్ ప్రాసిక్యూషన్ నిర్వహించారు. సాక్ష్యాలను సక్రమంగా ప్రవేశపెట్టిన వన్‌టౌన్ సీఐ లక్ష్మణరావు, కోర్టు కానిస్టేబుల్ విజయ్‌రాజును ఎస్పీ పి.జగదీష్ అభినందించారు.

కూరగాయల వ్యాపారి అనుమానాస్పద మృతి

యానాం: పట్టణంలోని విష్ణాలయం వీధిలో కూరగాయల వ్యాపారి మాగాపు వీరబాబు (55) గురువారం అర్ధరాత్రి అనుమానాస్పదంగా మృతి చెందాడు. సీఐ షణ్ముగం, ఎస్సై శేరు నూకరాజు శుక్రవారం తెలిపిన వివరాల ప్రకారం.. వీరబాబు తన కూరగాయల షాపులోనే ఫ్యాన్‌కు వేసిన ఉరికి వేలాడుతూ మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పోలీసులు జీజీహెచ్‌కు తరలించారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు. వీరబాబు మృతి పట్ల ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ తదితరులు సంతాపం తెలిపారు.

కొత్త ముప్పు.. ముందుచూపు



- కలవరపెడుతున్న నిపా వైరస్
- ఈ మహమ్మారిపై యుద్ధానికి సిద్ధమవుతున్న ప్రభుత్వం
- కాకినాడ జీజీహెచ్‌లో ప్రత్యేక వార్డు
- ఆక్సిజన్ సరఫరాతో 27 పడకలు
- ఆరుగురు వైద్యులతో పర్యవేక్షక బృందం
- కోవిడ్ అనుభవంతో కట్టుదిట్టంగా ఏర్పాట్లు

కాకినాడ క్రైం: ప్రపంచం 'ఊపిరి' అర్ధాంతరంగా స్తంభించిపోయిన దయనీయ దారుణమది. ఊహకందని రీతిలో వ్యాప్తి చెందిన కోవిడ్.. లెక్కకు మిక్కిలిగా ప్రాణాలు తోడేసింది. నాలుగేళ్ల నాటి కరోనా మహమ్మారి మిగిల్చిన కన్నీటి చారికలు చెరిగిపోక ముందే మరో మహమ్మారి భయపెడుతోంది. నిపా పేరుతో మరో ప్రమాదం ముంచుకొస్తోంది. ఈ వైరస్ బారిన పడిన వారిలో మరణాల (మోర్టాలిటీ) రేటును ప్రపంచ ఆరోగ్య సంస్థ 75 శాతంగా నిర్ధారించడం, వ్యాక్సిన్ సిద్ధం చేసేందుకు అత్యయిక స్థితి ప్రకటించడం ఆందోళన కలిగిస్తున్న అంశాలు. అయితే ప్రభుత్వాలు, వైద్య నిపుణులు భయం లేదంటూ భరోసా ఇవ్వడం ఓ సానుకూల అంశం. అందుకు తగినట్టుగానే ప్రభుత్వం ముందు చూపుతో సంసిద్ధమవుతోంది.

సమగ్రంగా..

గబ్బిలాలు, పందుల వల్ల నిపా వైరస్ వ్యాప్తి చెందుతుంది. దీనిని మలేషియాలో 1999లో పందులు పెంచే వర్గాల్లో గుర్తించారు. పశ్చిమ బెంగాల్ సహా అస్సాం, ఉత్తర ఈశాన్య రాష్ట్రాల్లో ఈ వైరస్ తన ఉనికిని చాటుకుంది. 2018లో కేరళలో ప్రవేశించింది. అదే ఏడాది మామిడి పండ్లు తిన్న 18 మంది అంతు చిక్కని కారణంతో చనిపోవడం సంచలనం రేపింది. నిపా వైరస్ సోకిన గబ్బిలాలు కొరికిన మామిడి పండ్లు తినడం వల్ల వారందరూ చనిపోయారని వైద్య పరీక్షల్లో తేలింది. 2021లోనూ కేసులు నమోదయ్యాయి. ఈ ఏడాది ఈ నెలలోనే కేరళ రాష్ట్రంలో ఇద్దరు చనిపోయారు. వారిలో తొమ్మిదేళ్ల బాలుడు ఉండటం కలవరపెడుతోంది. కోవిడ్ కూడా దేశంలో తొలిసారి కేరళ కేంద్రంగానే విజృంభించి, యావత్ దేశంలో ప్రతి మూలా వ్యాప్తి చెందిన విషయం అందరికీ తెలిసిందే.



వార్డులో సిద్ధం చేస్తున్న పడకలు

త్వరలో ట్రూనాట్ కిట్లు

నిపా వైరస్ అనుమానితుల నుంచి సేకరించిన శాంపిళ్లను పుణేలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ వైరాలజీ పరిధిలోని బయోసేఫ్టీ లెవెల్–4 ల్యాబ్‌లో పరీక్షిస్తారు. అయితే కాకినాడ జీజీహెచ్‌లో ట్రూనాట్ మెషీన్లు అందుబాటులో ఉన్నందున ట్రూనాట్ కిట్లను జీజీహెచ్‌కు సమకూర్చాలని ప్రభుత్వం భావిస్తోంది. తద్వారా స్థానికంగానే ప్రాథమిక పరీక్షలు నిర్వహించనున్నారు. ఇప్పటికే ట్రూనాట్ కిట్లకు ఆర్డర్ చేశారు. త్వరలో ఇవి జీజీహెచ్‌కు చేరుకోనున్నాయి.

మందులు సిద్ధం

నిపా వైరస్‌కు టీకా లేకపోయినా లక్షణాల ఆధారిత వైద్యం కోసం జీజీహెచ్ అధికారులు అన్ని రకాల మందులూ సిద్ధం చేస్తున్నారు. పలు పరిశోధనల ఆధారంగా వైరస్ తీవ్రతను తగ్గించి, బాధితుడి ప్రాణాలు నిలిపేందుకు అవసరమైన రెమిడెసివీర్ ఇంజక్షన్లు, ఫావీపవీర్, రిబావిరిన్ మాత్రలకు ఇండెంట్ సిద్ధం చేశారు. అలాగే లక్షణాల ఆధారంగా ఇచ్చే మాత్రలు, శ్వాసకోశ సంబంధిత చికిత్సకు ఉపయోగించే మందులు తగినన్ని ఉన్నాయని జీజీహెచ్ గ్రేడ్–1 ఫార్మసిస్టు పసుపులేటి శ్రీనివాస్ తెలిపారు.



నిపా బాధితుల చికిత్సకు జీజీహెచ్‌లో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వార్డు

పది రెట్లు అధికంగా ఆక్సిజన్

జీజీహెచ్‌లో ఆక్సిజన్‌కు ఏమాత్రం లోటు లేదు. ఆసుపత్రిలో మూడు లిక్విడ్ మెడికల్ ఆక్సిజన్ ప్లాంట్లు ఉన్నాయి. వాటిలో 20 కిలోలీటర్లవి 2, 10 కిలో లీటర్లవి 1 వినియోగంలో ఉన్నాయి. ఇవి కాకుండా అపెక్స్ సంస్థ అందించిన 20 కిలోలీటర్ల ఆక్సిజన్ ప్లాంట్ సిద్ధంగా ఉంది. అత్యవసరమైతే ఈ ప్లాంటును వినియోగిస్తారు. ప్రస్తుతం జీజీహెచ్‌లో రోజుకు 3 కిలోలీటర్ల ఆక్సిజన్ వినియోగం అవుతుండగా.. అంతకు పది రెట్లు అంటే 30 కిలోలీటర్ల వరకూ ఆక్సిజన్ సరఫరా చేయగలిగే సామర్థ్యం మూడు ప్లాంట్లకు ఉంది. కోవిడ్ అంతటి విపత్కర స్థితిలోనే గరిష్టంగా రోజుకు 18 కిలోలీటర్ల ఆక్సిజన్ మాత్రమే వినియోగమైంది.

సిద్ధంగా ర్యాపిడ్ రెస్పాన్స్ టీం

డీఎంఈ ఆదేశాల మేరకు జీజీహెచ్‌లో ఆరు విభాగాలకు చెందిన నిపుణులతో ర్యాపిడ్ రెస్పాన్స్ టీం కూడా సిద్ధమైంది. వీరు జీజీహెచ్‌లో నిపా కేసులు, బాధితులకు అందుతున్న వైద్య సేవలు, వారి స్థితిగతులను అనునిత్యం పర్యవేక్షిస్తూంటుంటారు. సూపరింటెండెంట్ ద్వారా తాజా పరిస్థితిని రాష్ట్ర విభాగానికి నివేదిస్తారు. డాక్టర్ వింధ్య (ప్రొఫెసర్, అనస్థీషియా), డాక్టర్ జి.రమ్య (నోడల్ ఆఫీసర్, అసిస్టెంట్ ప్రొఫెసర్, పల్మనాలజీ), డాక్టర్ ఎస్ఎం షరీఫ్ (అసోసియేట్ ప్రొఫెసర్, న్యూరాలజీ), డాక్టర్ ప్రశాంతి (అసిస్టెంట్ ప్రొఫెసర్, కార్డియాలజీ,), డాక్టర్ సూర్యకాంత్ (అసిస్టెంట్ ప్రొఫెసర్, జనరల్ మెడిసిన్), డాక్టర్ ఎం.వెంకట రమణ (అసిస్టెంట్ ప్రొఫెసర్, మైక్రోబయాలజీ)లతో ఈ ర్యాపిడ్ రెస్పాన్స్ టీమును సిద్ధం చేశారు.

జీజీహెచ్‌లో ప్రత్యేక ఏర్పాట్లు

రాష్ట్ర ప్రభుత్వ నిర్దేశం, రాష్ట్ర వైద్య విద్య సంచాలకుడు (డీఎంఈ) ఆదేశాలతో నిపా వైరస్ నియంత్రణ, చికిత్సకు కాకినాడ జీజీహెచ్‌లో ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. దీనికి మార్గదర్శకాలు నిర్దేశిస్తూ డీఎంఈ రాష్ట్ర స్థాయిలో ప్రత్యేక ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు జీజీహెచ్ ఈఎన్‌టీ భవనంలో 27 పడకలతో నిపా వైరస్ ప్రత్యేక వార్డును సిద్ధం చేశారు. ప్రతి పడకకూ ఐసీయూ స్థాయి ఆక్సిజన్ సరఫరా ఏర్పాటు చేశారు. వీరికి వైద్య సేవలు అందించేందుకు పల్మనాలజీ, జనరల్ మెడిసిన్, కార్డియాలజీ, న్యూరాలజీ, ఈఎన్‌టీ నిపుణులను సిద్ధం చేశారు. పారామెడికల్, నర్సింగ్, శానిటేషన్ సిబ్బందినీ నియమించారు. నిపా బాధితులకు తగిన సేవలు అందించడంలో వీరికి ప్రత్యేక శిక్షణ ఇస్తున్నారు.

ఏం భయం లేదు



నిపా వైరస్ బాధితులు వచ్చినా.. వారిని రక్షించేందుకు జీజీహెచ్‌లో అన్ని ఏర్పాట్లూ ఉన్నాయి. ర్యాపిడ్ రెస్పాన్స్ టీం కీలకంగా వ్యవహరిస్తుంది. మందుల నుంచి ప్రాణవాయువు వరకూ లోటు లేదు. వైరస్ స్థాయి ఎలా ఉన్నా బాధితుల ప్రాణానికి ముప్పేమీ లేదు. జీజీహెచ్‌లో అన్ని ఏర్పాట్లూ చేశాం. కలెక్టర్ నేరుగా పర్యవేక్షిస్తారు. ఆమెతో కలసి రాష్ట్ర స్థాయికి నివేదిస్తున్నాం. సాధారణ ఫ్లూ లక్షణాలేనన్న నిర్లక్ష్యం వద్దు. వైద్య నిపుణుల్ని సంప్రదించాలి.

– డాక్టర్ సరెళ్ల లావణ్యకుమారి, సూపరింటెండెంట్, జీజీహెచ్, కాకినాడ

మళ్లీ మాస్క్



లక్షణాల ఆధారంగానే నిపా వైరస్ బాధితులకు చికిత్స అందిస్తాం. వైరస్ కావడంతో మందులు లేవు. టీకా తయారీకి పరిశోధనలు కీలక దశలో ఉన్నాయి. గబ్బిలాల నుంచి వచ్చినా వ్యాప్తి మాత్రం మనుషుల ద్వారానే జరుగుతుంది. లాలాజలం, తుంపర్లు, శరీర ద్రవాల నుంచి వ్యాప్తి చెందే అవకాశం ఉంది. జ్వరం, తలనొప్పి, మత్తు నిపా వైరస్ ప్రధాన లక్షణాలు. శ్వాసకోశాలు ప్రభావితమయ్యే అవకాశం ఉంది. కోవిడ్ తరహాలోనే మాస్క్ ధరించడం, శానిటైజర్ వాడటం, సామాజిక దూరం పాటించడం అత్యవసరం.

– డాక్టర్ వి.సూర్యకుమారి, పల్మనాలజీ విభాగాధిపతి, జీజీహెచ్, కాకినాడ

విద్యార్థులు శాస్త్రవేత్తలుగా ఎదగాలి

మధురపూడి: విద్యార్థులు శాస్త్రవేత్తలుగా ఎదిగి దేశానికి సేవలందించాలని కేంద్ర రక్షణ మంత్రిత్వ శాఖ సైంటిఫిక్ సలహాదారు, శాస్త్రవేత్త డాక్టర్ జి.సతీష్ రెడ్డి ఆకాంక్షించారు. కోరుకొండ మండలం గాడాలలోని లారెల్ హై గ్లోబల్ స్కూల్‌లో శుక్రవారం జరిగిన విజ్ఞాన ప్రదర్శనలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, దేశానికి విద్యార్థులు రేపటి భవిష్యత్ అని అన్నారు. రక్షణ రంగ ప్రాధాన్యాన్ని వివరించారు. ప్రతి విద్యార్థీ చదువులో నూతన ఆవిష్కరణల ద్వారా మేధోశక్తిని పెంపొందించుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా విద్యార్థులు రూపొందించిన పలు ప్రయోగాలను పరిశీలించారు. ప్రతిభ చూపిన విద్యార్థులను అభినందించారు. స్కూల్ ప్రాంగణంలో సతీష్‌రెడ్డి మొక్క నాటారు. కార్యక్రమంలో డాక్టర్ వరప్రసాద్‌రెడ్డి, కరస్పాండెంట్ సుంకర రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థుల ప్రయోగాలను పరిశీలిస్తున్న సతీష్‌రెడ్డి

పొగాకు, ఇతర పంటలపై పరిశోధనలు

- సీటీఆర్ఐ డైరెక్టర్ డాక్టర్ మాగంటి శేషుమాధవ్
- పరిశోధన కమిటీ సమావేశాలు ప్రారంభం

రాజమహేంద్రవరం రూరల్: పొగాకుతో పాటు వాణిజ్య పంటలైన పసుపు, మిరప, అశ్వగంధ, ఆముదం వంటి పంటలపై కూడా పరిశోధనలు చేపట్టాల్సి ఉంటుందని కేంద్ర పొగాకు పరిశోధన సంస్థ (సీటీఆర్ఐ) డైరెక్టర్ డాక్టర్ మాగంటి శేషుమాధవ్ అన్నారు. మూడు రోజుల పాటు నిర్వహించే పరిశోధన కమిటీ సమావేశాలను సీటీఆర్ఐ సెమినార్ హాలులో శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, భవిష్యత్ పరిశోధనల నిర్వహణపై తొలి రోజు సుదీర్ఘ చర్చలు జరిగాయని, ఇది ఒకవిధంగా పరిశోధనా రంగంలో ఆడిట్ వంటిదేనని అన్నారు. వివిధ రకాల వంగడాలను ప్రవేశపెట్టి, పొగాకు జెర్మ్ ప్లాస్మ సంరక్షణ, పర్యవేక్షణలో తమదైన ముద్ర వేశారని చెప్పారు. గత సంవత్సరం ఐదు వంగడాలను విడుదల చేశామన్నారు. ట్యాపింగ్ టూల్, పొగాకు బేళ్ల ప్రెస్సింగ్, పొగాకు ఆకులు కుట్టే, నాట్లు వేసే యంత్రాలు, పోలీ ట్రే ప్రెస్సింగ్ టూల్ వంటి వాటిపై విస్తృత పరిశోధనలు జరిగాయని డాక్టర్ శేషుమాధవ్ చెప్పారు. ఇన్ఫర్మేషన్ కమ్యూనికేషన్ టెక్నాలజీలో ముందంజ వేశామన్నారు. పొగాకు అగ్రి దక్ష, డిజిటల్ ఫీల్డ్ నోట్ బుక్ వంటి అనేక సాఫ్ట్‌వేర్‌లను, రైతుల ప్రయోజనార్థం సీడ్ పోర్టల్ వంటి అప్లికేషన్లను రూపొందించామని తెలిపారు. డిజిటల్ లావాదేవీల ద్వారా రూ.1.80 కోట్ల విలువైన విత్తనాలను రైతులకు అందించామని చెప్పారు. పొగాకు బోర్డు, సీఎస్ఐఆర్, నన్నయ యూనివర్సిటీ, తమిళనాడు అగ్రికల్చరల్ యూనివర్సిటీ వంటి వాటితో అవగాహన ఒప్పందాలు చేసుకున్నామని డాక్టర్ శేషుమాధవ్ తెలిపారు. ఈ సమావేశాల్లో హైదరాబాద్‌లోని ఐసీఏఆర్, ఐఐఓఆర్ నూనె గింజల పరిశోధన సంస్థ పూర్వ డైరెక్టర్ డాక్టర్ ఎం.సుజాత ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. పంటల అభివృద్ధి విభాగానికి జెనెటిక్స్ ఎక్స్‌పర్ట్‌గా సీటీఆర్ఐ పూర్వ డైరెక్టర్ డాక్టర్ టీజీకే మూర్తి, మెంబర్ సెక్రటరీగా డాక్టర్ ఎం.అనురాధ, సమన్వయకర్తగా సీటీఆర్ఐ ప్రిన్సిపల్ సైంటిస్ట్ కె.సుమన్ కల్యాణి వ్యవహరించారు.



సమావేశంలో మాట్లాడుతున్న సీటీఆర్ఐ డైరెక్టర్ డాక్టర్ శేషుమాధవ్

రౌడీషీటర్ హత్య కేసులో మరో ముగ్గురి అరెస్టు

అమలాపురం రూరల్: ఈదరపల్లిలో ఈ నెల 1న జరిగిన రౌడీషీటర్ పోలిశెట్టి రామకృష్ణ (కిషోర్) హత్య, అతడితో ఉన్న అడపా సాయిపై హత్యాయత్నం కేసులో మరో ముగ్గురిని పోలీసులు గురువారం సాయంత్రం అరెస్టు చేశారు. అరెస్టయిన వారిలో కొంకాపల్లి చెందిన రౌడీషీటర్ ఇందుగుల ఆనంద్ కుమార్ (ఆనంద్), అల్లవరం మండలం గూడాల చెందిన మేడిద వెంకట రామకృష్ణ (దొరబాబు), నూకల వెంకటేష్ ఉన్నారు. వీరి నుంచి ఒక మోటార్ సైకిల్ స్వాధీనం చేసుకున్నారు. డీఎస్పీ అంబికా ప్రసాద్ శుక్రవారం ఈ వివరాలు తెలిపారు. ఈ ముగ్గురితో కలిపి ఈ కేసులో ఇప్పటి వరకూ 16 మందిని అరెస్టు చేశామని చెప్పారు. ఈ కేసులో మరి కొంతమంది నిందితులను అరెస్టు చేయాల్సి ఉందన్నారు. వారిని పట్టుకునేందుకు జిల్లా ఎస్పీ ఎస్.శ్రీధర్ ఆదేశాల మేరకు ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేశామని తెలిపారు. అడిషనల్ ఎస్పీ (అడ్మిన్) ఎస్.ఖాదర్‌బాషా ప్రత్యక్ష పర్యవేక్షణలో, తనతో పాటు టౌన్ ఇన్‌చార్జి సీఐ పి.వీరబాబు బృందం ఈ కేసును దర్యాప్తు చేస్తున్నామని అంబికా ప్రసాద్ తెలిపారు.

రాష్ట్ర స్థాయి సైన్స్ సెమినార్‌కు ఎంపిక

కె.గంగవరం: రాష్ట్ర స్థాయి సైన్స్ సెమినర్‌కు కె.గంగవరం ఉన్నత పాఠశాల ఎంపికైందని హెచ్ఎం వెంకటేశ్వరరావు తెలిపారు. ఇటీవల కాకినాడలో జరిగిన సైన్స్ సెమినార్‌లో జిల్లా నుంచి 65 పాఠశాలలు పాల్గొన్నాయన్నారు. అక్కడ కె.గంగవరం ఉన్నత పాఠశాల సైన్స్ ఉపాధ్యాయులు పీవీ బ్రహ్మనందం మార్గదర్శకత్వంలో విద్యార్థి ఓరుగంటి నాగమణి ప్రదర్శించిన చిరుధాన్యాలు బలవర్థక ఆహారమా – వ్యామోహపూరిత ఆహారమా అనే అంశం జిల్లా స్థాయిలో ప్రథమ స్థానం సాధించి, రాష్ట్ర స్థాయికి ఎంపికైంది. ఈ నెల 25న విజయవాడలో జరిగే రాష్ట్ర స్థాయి సైన్స్ సెమినార్‌లో ఈ విద్యార్థిని నాగమణి పాల్గొంటుందని హెచ్ఎం తెలిపారు. ఆమెను జిల్లా ఉప విద్యాశాఖాధికారి ఫణి, సైన్స్ అధికారి జీవీఎస్ సుబ్రహ్మణ్యం, ఎంఈఓలు నాగరాజు, ఆంజనేయులు తదితరులు అభినందించారు.

జీవ నియంత్రణ పద్ధతులతో తెగుళ్ల నివారణ



లలలల

అంబాజీపేట: జీవ నియంత్రణ పద్ధతులతోనే కొబ్బరిపై తెగుళ్ల నివారణ సాధ్యమవుతుందని స్థానిక డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన పరిశోధన కేంద్రం అధిపతి డాక్టర్ ఎన్‌బీవీ చలపతిరావు అన్నారు. పరిశోధన కేంద్రాన్ని ఎఫ్‌పీఓ బోర్డు సభ్యులు, మన రాష్ట్రంతో పాటు మహారాష్ట్ర, తమిళనాడుల్లో కొత్తగా బాధ్యతలు స్వీకరించిన నాబార్డ్ అసిస్టెంట్ మేనేజర్లు శుక్రవారం సందర్శించారు. వారికి ఇక్కడ జరుగుతున్న పరిశోధనలు తదితర అంశాలపై శాస్త్రవేత్తలు అవగాహన కల్పించారు. కొబ్బరి రకాలు, గుణగణాలు, నాణ్యమైన మొక్కల ప్రవర్ధనం, అధిక దిగుబడులకు సమగ్ర సేద్య పద్ధతులు, అధిక ఆదాయానికి కొబ్బరిలో వేసుకోదగిన అంతర పంటలు తదితర విషయాలను ఉద్యాన విభాగ శాస్త్రవేత్త ఎ.కిరీటి వివరించారు. కీటక విభాగంలో పరాన్న జీవుల ఉత్పత్తి, జీవ నియంత్రణ పద్ధతి ద్వారా తెల్లదోమ, నల్లముట్టి, కొమ్ము పురుగుల నివారణ చర్యలపై కీటక విభాగం శాస్త్రవేత్త డాక్టర్ వి.అనూష అవగాహన కల్పించారు. బూజు జాతి సూక్ష్మ జీవ నియంత్రణ కారకాలైన ట్రైకోడెర్మా స్పీసిస్‌లను ఉపయోగించి కొబ్బరిని ఆశించే గానోడెర్మా, నల్లమచ్చ, మొవ్వకుళ్లు తెగుళ్లను అరికట్టే విధానాలను తెగుళ్ల విభాగం శాస్త్రవేత్త డాక్టర్ వి.గోవర్ధనరావు వివరించారు. అనంతరం వారికి కొబ్బరిలో ఎరువులు వేయడం, తెగుళ్లను అరికట్టడానికి జీవ శిలీంద్రాల వినియోగం, తెల్లదోమ, వివిధ కీటకాలను బదనికల ద్వారా నివారించడంపై క్షేత్ర స్థాయిలో అవగాహన కల్పించారు.

కుమార్తెపై లైంగిక దాడి కేసులో పదేళ్ల జైలు

కంబాలచెరువు (రాజమహేంద్రవరం)/రాజానగరం: కామంతో కన్నుమిన్ను కానకుండా కన్న కూతురిపై లైంగిక దాడి చేసిన ఘటనలో ఓ తండ్రికి పదేళ్ల జైలు శిక్ష, రూ.వెయ్యి జరిమానా విధిస్తూ పోక్సో స్పెషల్ కోర్టు జడ్జి ఎల్.వెంకటేశ్వరరావు శుక్రవారం తీర్పు చెప్పారు. రాజానగరం సీఐ కాశీ విశ్వనాథ్ కథనం ప్రకారం.. నిందితుడిది రాజమహేంద్రవరం రూరల్ మండలం కొంతమూరు సంతోష్ నగర్. 2017 జూన్ ఒకటో తేదీ అర్ధరాత్రి విద్యుత్ సరఫరా నిలిచిపోయిన సమయంలో అతడు తన పదకొండేళ్ల కుమార్తెపై లైంగిక దాడికి ఒడిగట్టాడు. కనురెప్పే కాటు వేస్తుందని ఊహించని ఆ బాలిక భయాందోళనతో గట్టిగా కేకలు వేయడంతో నిందితుడు అక్కడి నుంచి పరారయ్యాడు. వెంటనే బాధిత బాలిక ఈ విషయాన్ని ఇంటి బయట నిద్రిస్తున్న అమ్మమ్మకు తెలిపింది. ఆమె వెంటనే మనవరాలిని ఆస్పత్రికి తీసుకువెళ్లి, వైద్యులకు చూపించింది. జరిగిన దారుణంపై అప్పటి రాజానగరం సీఐ కె.వరప్రసాద్‌కు ఫిర్యాదు చేసింది. పోక్సో చట్టం కింద నిందితుడిపై కేసు నమోదు చేసిన నాటి డీఎస్పీ కె.రమేష్‌బాబు ఆధ్వర్యాన పోలీసులు దర్యాప్తు చేపట్టారు. కోర్టు విచారణలో నిందితుడిపై నేర నిరూపణ జరగడంతో న్యాయమూర్తి పైవిధంగా తీర్పు చెప్పారు. ఈ కేసులో ప్రాసిక్యూషన్ తరఫున బలమైన వాదనలు వినిపించిన పీపీ పితాని శ్రీనివాసరావును, దర్యాప్తు చేసిన నాటి ఈస్ట్ జోన్ డీఎస్పీ రమేష్‌బాబు, దిశ డీఎస్పీ కె.తిరుమలరావు, సీఐ కాశీవిశ్వనాథ్, పోక్సో కోర్టు కో ఆర్డినేటర్, దిశ సీఐ ఇ.రమణమ్మ, హెడ్ కానిస్టేబుల్ ఎం.సత్యకుమార్, కానిస్టేబుళ్లు ప్రసాద్, సతీష్‌లను జిల్లా ఎస్పీ పి.జగదీష్ అభినందించారు. మహిళలు, చిన్నారులు పై వేధింపులకు పాల్పడితే కఠిన శిక్షలు తప్పవని హెచ్చరించారు.